నేడు శాప్ చైర్మన్ పర్యటన

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు ఆదివారం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు నరసన్నపేటలోని క్రీడా వికాస కేంద్రం, 10.30 గంటలకు శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియాన్ని పరిశీలిస్తారని అన్నారు. 11 గంటలకు విలేఖర్ల సమావేశంలో మాట్లాడతారని, 11.30 గంటలకు స్థానిక ప్రజాప్రతినిధితో కలిసి జిల్లాలో క్రీడాభివృద్ధికి తీసుకోవల్సిన చర్యలపై చర్చిస్తారని వివరించారు. మైదానాల అభివృద్ధికి ప్రణాళికలను రూపొందిస్తారని పేర్కొన్నారు.

శివ పూజకు వేళాయె!

- శైవాలయాల్లో భక్తుల సందడి
- కార్తీక మాస పూజలు ప్రారంభం


విద్యుత్ వెలుగుల్లో టెక్కలి రామలింగేశ్వర స్వామి ఆలయం

కార్తీక మాసం అత్యంత విశిష్టమైనది. ఈ నెలలో ప్రతిరోజూ పరమ శివుడికి ప్రీతికరమే. భక్తులు పరమ పవిత్రంగా భావించి శివుడి అనుగ్రహం కోసం పూజలు చేస్తారు. శనివారం నుంచి కార్తీక మాసం ప్రారంభంకావడంతో జిల్లాలోని శివాలయాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్నాయి. శ్రీముఖలింగం, రావివలస ఎండల మల్లికార్జున, శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వర, తదితర ఆలయాల్లో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు.

6లో


శ్రీకాకుళం నగరంలోని ఉమారుద్ర కోటేశ్వర ఆలయం



ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

- ఐదేళ్ల తరువాత గిరిజన దర్బార్
- రేపు మెళియాపుట్టిలో నిర్వహణ

మెళియాపుట్టి నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గిరిజన దర్బార్ కార్యక్రమానికి అధికారులు మళ్లీ శ్రీకారం చుట్టారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నీరుగార్చింది. దీంతో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గిరిజన దర్బార్‌ను నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మెళియాపుట్టి వెలుగు కార్యాలయంలో సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఐదేళ్ల తరువాత గిరిజన దర్బారు జరుగుతుండడంతో తమ సమస్యలు పరిష్కారమవుతాయని గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


మెళియాపుట్టి వెలుగు కార్యాలయం

గిరిజన సమస్యలు పట్టించుకోని వైసీపీ సర్కారు..

గత వైసీపీ ప్రభుత్వం గిరిజన సమస్యలను పట్టించుకోలేదు. పైగా సబ్‌ప్లాన్ నిధులను పక్కతోవ పట్టించింది. ఈ నిధులను ఇతర కార్పొరేషన్లకు మళ్లించింది. గత ఐదేళ్ల పాటు గిరిజన దర్బార్ నిర్వహించలేదు. గిరిజనుల నుంచి అధికంగా ఆర్థికపరమైన సమస్యలపై దరఖాస్తులు వస్తున్నాయని, వీటిని పరిష్కరించే పరిస్థితి లేదని చెప్పి గత పీవోలు సైతం మండలాల్లో గిరిజన దర్బార్‌లను ఏర్పాటు చేయలేదు. మరోపక్క జిల్లాల విభజనతో సీతంపేట ఐటీడీఏ పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్లిపోయింది. దీంతో జిల్లాలోని గిరిజనులకు ఐటీడీఏ లేకుండా పోయింది. వారు తమ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు మూడు బస్సులు మారి, సుమారు 80 కిలోమీటర్ల దూరంలోని సీతంపేట ఐటీడీఏకు వెళ్లివస్తున్నారు. దీనివల్ల వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మండలాల్లో గిరిజన దర్బార్‌ను నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు సబ్‌ప్లాన్ నిధులనూ గిరిజనుల అభివృద్ధికే వినియోగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెబుతుండడంతో ఐటీడీఏలకు ఊపిరివచ్చినట్లు కనిపిస్తుంది.

అధికారులు హాజరుకావాలి



ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరుతో మెళియాపుట్టి వెలుగు కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్‌ను నిర్వహిస్తున్నాం. దర్బార్‌కు టెక్కలి, పలాస డివిజన్ స్థాయి అధికారులు హాజరుకావాలి. సమస్యలపై గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తాం.

-సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఐటీడీఏ పీవో

ధాన్యం కొనుగోలు ఇంకెప్పుడు?

- జిల్లాలో ఇంకా ఏర్పాటు కాని కొనుగోలు కేంద్రాలు
- గోదావరి జిల్లాల నుంచి వ్యాపారులు వచ్చి తరలించుకుపోతున్న వైనం

6లో



మళ్లీ వస్తా.. సమీక్ష చేస్తా

- సిక్కోలును అభివృద్ధి పథంలో నడిపిస్తా
- అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయండి
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు


ఎర్రన్నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, తదితరులు

అరసవల్లి/అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సిక్కోలును అభివృద్ధి పథంలో నడిపిస్తామని, అందుకు తగ్గ ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులు, నాయకులను ఆదేశించారు. రెండు రోజుల జిల్లా పర్యటనను ముగించుకుని శనివారం ఆయన అనకాపల్లి వెళ్లారు. ముందుగా శ్రీకాకుళం ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద పార్టీ నాయకులు, జిల్లా అధికారులతో మాట్లాడారు. 2019కి ముందు ఏ ప్రణాళికలతో సిక్కోలును అభివృద్ధి చేద్దామని అనుకున్నామో, వాటిని నేటి వరకు కూడా అమలు చేయకపోవడం జిల్లా అభివృద్ధికి ఆటంకంగా మారిందని అన్నారు. నాడు అభివృద్ధి కోసం సిద్ధం చేసిన ప్రణాళికలతో పాటు, సహజ వనరులు, రహదారులు, సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి, అరసవల్లి మాస్టర్ ప్లాన్, తదితర వివరాలపై నివేదికను అందించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును సీఎం కోరారు. త్వరలో శ్రీకాకుళంలో మళ్లీ పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. అనంతరం కేంద్ర మాజీ మంత్రి, దివంగత నేత ఎర్రన్నాయుడు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఎం చంద్రబాబు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం 11.05 గంటలకు హెలీకాప్టర్‌లో అనకాపల్లి బయలు దేరి వెళ్లారు. ఆయనకు కేంద్రమంత్రితో పాటు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, కూన రవికుమార్, గౌతు శిరీష, బెందాళం అశోక్, బగ్గు రమణమూర్తి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఐటీడీఏ పీవో యశ్వంత్ రెడ్డి, తదితరులు వీడ్కోలు పలికారు.

ప్రజల కోసమే ఎర్రన్న పరితపించారు

శ్రీకాకుళం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎర్రన్నాయుడు తనకు అత్యంత ఆప్తుడని, అనునిత్యం ప్రజలకోసం పరితపించిన వ్యక్తి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఎర్రన్న చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తెలుగు ప్రజలకు, మరీ ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా ప్రజల కోసం ఎర్రన్న చేసిన సేవలు మరువలేనివని అన్నారు. పార్టీకి అంకిత భావంతో సేవలు అందించిన నాయకుడిగా ఆయన చిరకాలం గుర్తుండిపోతారని పేర్కొన్నారు.


నిమ్మాడలో ఎర్రన్న ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

ఎర్రన్నకు ఘన నివాళి

టెక్కలి/కోటబొమ్మాళి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివంగత నేత, కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 12వ వర్ధంతిని తన స్వగ్రామం నిమ్మాడలో కుటుంబ సభ్యులు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఎర్రన్న ఘాట్ వద్ద కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎర్రన్నాయుడు భార్య విజయమ్మ, సోదరులు కింజరాపు ప్రభాకర్, ప్రసాద్, డాక్టర్ శ్రీనివాసరావు, సురేష్, కృష్ణమోహన్‌నాయుడు, తనూజ్‌నాయుడు, విజయమాధవి, శ్రీశ్రావ్య, మిహిర అన్వి శివాంకృతి, తదితర కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. జిల్లా ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పలువురు అధికారులు కూడా ఎర్రన్న ఘాట్ వద్ద నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి వేలాదిమంది కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పెద్దఎత్తున రావడంతో నిమ్మాడ కిక్కిరిసింది.

అపార్ కష్టాలు





- తప్పులతడకగా విద్యార్థుల ఆధార్ వివరాలు
- అపార్ ప్రక్రియకు అవరోధంగా మారిన వైనం
- విద్యార్థులకు తప్పని అవస్థలు
- జనన ధ్రువీకరణపత్రాల కోసం కార్యాలయాలకు పరుగు
- ఈ నెల 30 వరకు గడువు

నరసన్నపేట మండలం సత్యవరం గ్రామానికి చెందిన చీర లక్ష్మీనారాయణ కుమారుడు తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తన ఆధార్ కార్డులో పుట్టిన తేదీ లేదు. జనన ధ్రువపత్రం కూడా లేదు. ఆధార్‌లో వివరాలు సక్రమంగా లేకపోవడంతో అపార్ కార్డు పొందేందుకు ఆ విద్యార్థి ఇబ్బందులు పడుతున్నాడు. ఆధార్ కార్డులో పుట్టిన తేదీ నమోదు కోసం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు.

నరసన్నపేట మండలం ఉర్లాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఒక విద్యార్థిని పేరు ఆధార్‌లో తప్పుగా ఉంది. దాన్ని సరిదిద్దాలంటే సరైన ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ఆధార్ కేంద్ర నిర్వహకులు చెబుతున్నారు. ఆ విద్యార్థి వద్ద జనన ధ్రువపత్రం కూడా లేదు. పాఠశాలహెచ్‌ఎం ఇచ్చిన సర్టిఫికెట్ పనిరాదంటున్నారు. మరి ఆధార్ పేరు ఎలా మార్పు చేయాలని విద్యార్థి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నరసన్నపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విధానం ప్రకారం ప్రతీ విద్యార్థికి అపార్ (ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డు తప్పనిసరి చేసింది కేంద్రం ప్రభుత్వం. ఆధార్ కార్డులోని వివరాల ఆధారంగా అపార్ కార్డులు జారీ చేస్తారు. అయితే, జిల్లాలోని చాలామంది విద్యార్థుల ఆధార్ కార్డుల్లో వివరాలు తప్పుగా ఉన్నాయి. దీంతో అపార్ కార్డును పొందేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఆధార్‌లో వివరాలు తప్పుల తడకగా ఉండడంతో ఆన్‌లైన్‌లో అపార్ నమోదుకు సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా ఆధార్‌కార్డుల్లో విద్యార్థుల పుట్టిన తేదీ పూర్తిగా లేకపోవడం, వారిపేర్లు, తల్లిదండ్రుల పేర్లు, ఇంటి పేర్లు తప్పుగా ఉండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. పుట్టిన తేదీల నమోదుకు అవసరమైన జనన ధ్రువపత్రాల కోసం గ్రామీణ విద్యార్థులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

జనన ధ్రువపత్రాల కోసం పాట్లు

విద్యార్థులకు సంబంధించి పాఠశాలల రికార్డుల్లో నమోదైన పుట్టిన తేదీకి, ఆధార్ కార్డులో ఉన్న పుట్టిన తేదీకి తేడాలు ఉన్నాయి. కొందరి పిల్లల ఆధార్ కార్డుల్లో పుట్టిన తేదీ, నెల లేకుండా కేవలం సంవత్సరం మాత్రమే ఉంది. ఇది మార్పు చేయాలంటే జనన ధ్రువపత్రం తప్పనిసరి. గ్రామీణ ప్రాంతాల్లో పుట్టిన తేదీ ధ్రువపత్రాలు తీసుకున్న వారు చాలా తక్కువ. ఇప్పుడు దీని అవసరం పడడంతో కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. జనన ధ్రువపత్రం కావాలంటే.. ముందుగా పంచాయతీ కార్యాలయంలో నాన్ ట్రేస్ సర్టిఫికెట్ తీసుకొని రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. దీన్ని తహసీల్దార్ పరిశీలించి ఆర్డీవోకు పంపిస్తారు. ఆర్డీవో పరిశీలన అనంతరం పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు. ఈ తంతాంగం అంతా జరిగే సరికి సుమారు 15 రోజులు నుంచి 30 రోజులు పడుతుంది. ఈలోపు అపార్ నమోదు గడుపు ముగుస్తుందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. పాఠశాలల రికార్డుల్లోని వివరాల ప్రకారం విద్యార్థుల ఆధార్ కార్డులో వివరాలు మార్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆధార్ సవరణ బాధ్యత హెచ్‌ఎంలకు అప్పగిస్తే ప్రయోజనం ఉంటుందని అంటున్నారు. దీనికోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహిసే అపార్ నమోదు మరింత వేగవంతం అవుతుంది.

జిల్లాలో పరిస్థితి ఇది..

జిల్లాలో 38 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 11,816 మంది విద్యార్థులు, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో 23,498 మంది విద్యార్థులు చదువుతున్నారు. 1,915 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 45,018 మంది, 315 యూపీ పాఠశాల్లో 22,569 మంది, 419 ఉన్నత పాఠశాలల్లో 79,497 మంది, ప్రైవేటు పాఠశాలల్లో 78 వేలమందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం అందిన వివరాల మేరకు ఒక్కొక్క పాఠశాలలో కేవలం 30 నుంచి 40మంది విద్యార్థుల వివరాలు మాత్రమే అపార్‌లో నమోదయ్యాయి. జిల్లాలో 20 శాతం నుంచి 30శాతం మేరకే అపార్ పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. పలువురు విద్యార్థుల వివరాలు పాఠశాల యూ డైస్‌లో ఒకలా, ఆధార్ కార్డులో మరోలా ఉండడంతో సాంకేతికంగా సమస్యలు ఏర్పడుతున్నాయని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ఈనెల 30 వరకే అపార్ నమోదుకు అవకాశం ఉండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.


నరసన్నపేట పంచాయతీ కార్యాలయం వద్ద జనన ధ్రువపత్రాల కోసం పడిగాపులు కాస్తున్న విద్యార్థులు

అపార్‌తో ప్రయోజనం

అపార్ కార్డు కూడా విద్యార్థులకు ఎంతో కీలకం కానుంది. ఇందులో విద్యార్థులకు సంబంధించిన పూర్తి సమాచారం పొందుపర్చనున్నారు. 12 అంకెలతో కూడిన జీవిత కాల ఐడీ నెంబర్ ఇస్తారు. దీని ద్వారా విద్యార్థులు అకడమిక్ రికార్డులను ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా పొందవచ్చును. విద్యార్థుల విద్యా ప్రమాణం, విజయాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడంతో పాటు ట్రాక్ చేస్తుంది. అలాగే ఒక పాఠశాల నుంచి మరోక పాఠశాలకు బదిలీ అయ్యేందుకు ఉపయోగపడుతుంది.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం

విద్యార్థుల ఆధార్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. సచివాలయాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆధార్ నమోదు చేపడుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 30శాతానికి పైగా అపార్ నమోదైంది. కళాశాలల విద్యార్థుల ఆధార్‌కార్డులో పేర్లు, పుట్టిన తేదీలు మార్పుకు పదోతరగతి సర్టిఫికెట్ సరిపోతుంది. అపార్ ప్రక్రియను వేగవంతం చేయాలని హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లను ఆదేశించాం.

– ఎస్.తిరుమల చైతన్య, డీఈవో,

– పి.దుర్గారావు, ఆర్‌ఐవో శ్రీకాకుళం

శివ పూజకు వేళాయె!

● శైవాలయాల్లో భక్తుల సందడి ● కార్తీక మాస పూజలు ప్రారంభం


శ్రీముఖలింగం ఆలయం

కార్తీకమాసం... ఏడాదిలో అత్యంత విశిష్టమైనదిగా భక్తులు భావించే మాసం. ఈ నెలలో భక్తులతో శివాలయాలు కొత్త శోభను సంతరించుకుంటాయి. ప్రత్యేకంగా కార్తీక సోమవారాలలో శివ క్షేత్రాలకు అత్యధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. జిల్లాలో శ్రీముఖలింగం, రావివలస ఎండల మల్లికార్జున ఆలయం తదితర వాటికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని శైవ క్షేత్రాలు... వాటి విశిష్టతను తెలుసుకుందాం.

ముక్తికి మార్గం చూపే శ్రీముఖలింగం..


శ్రీముఖలింగేశ్వరుడు

జలుమూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెంది... భక్తకోటిని పునీతులను చేస్తున్న దివ్యక్షేత్రం శ్రీముఖలింగం. వంశధార నదీ తీరాన వెలసిన స్వామి శ్రీముఖలింగేశ్వరుడిగా పూజలందుకుంటున్న పుణ్యస్థలం. పరమ శివుడు ముఖాకృతిలో భక్తులకు దర్శనమిస్తున్న ఏకైక ఆలయం ఇది ఒక్కటే. ఈ పుణ్యక్షేత్రం కాశీకి తుల్యమైనదిగా అగస్త్యేశ్వరునికి కుమార స్వామి అభివర్ణించినట్టు పురాణాలు చెబుతున్నాయి. శ్రీముఖలింగ క్షేత్రం జలుమూరు మండలంలో.. శ్రీకాకుళానికి 50 కి.మీ. దూరంలో ఉంది. శ్రీముఖలింగం అనగా పరమేశ్వరుని ముఖం లింగంలో కనిపించడమని అర్థం. ఇది దక్షిణ కాశీగా కూడా ప్రసిద్ధి చెందిన పురాతన క్షేత్రం. కాశీలో లింగం, గంగలో స్నానం, శ్రీశైలంలో శిఖరం, శ్రీముఖలింగంలో ముఖదర్శనం చేసుకుంటే మోక్షం సిద్ధిస్తుందని పెద్దల మాట. మూడుచోట్ల ముక్కోణం ఆకారంలో మూడు ఆలయాలు ఉన్నాయి. వాటిలో ప్రధానమైనది మధుకేశ్వరాలయం. దీనికి అభిముఖంగా కొంతదూరంలో భీమేశ్వర ఆలయం ఉంది. వీటికి కాస్త దూరంగా ఊరి ప్రారంభంలో సోమేశ్వరాలయం సందర్శకులకు ఆహ్వానం పలుకుతున్నట్లు కనిపిస్తుంది. కార్తీక మాసంలో స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు.

శ్వేతరాజు కాలం నాటి శైవ క్షేత్రం..


వీర వసంత ఈశ్వరుడు

గార, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గార మండలం శాలిహుండం కొండపై శ్వేతరాజు కాలం నాటి ప్రసిద్ధ వీర వసంత ఈశ్వర స్వామి పూజలు అందుకుంటున్నాడు. పవిత్ర వంశధార నదీ తీరంలో శ్వేతగిరిపై కొలువైన ఈ స్వామి భక్తుల కోర్కెలు తీర్చేవాడిగా ప్రసిద్ధి చెందాడు. భక్తులు కొండపైన గల గుడికి చేరుకోవడానికి ఘాట్ రోడ్డుతో పాటు, మెట్ల మార్గం కూడా ఉంది. ఇక్కడ ఏడాది పొడవునా శివునికి ప్రత్యేక అభిషేకాలు, నిత్య పూజలు చేస్తారు. ఏటా భీష్మ ఏకాదశి రోజున పెద్ద ఎత్తున యాత్ర జరుగుతుంది. శ్రీకాకుళం నుంచి గార వరకు బస్సు, ప్రైవేటు వాహనాల్లో చేరుకోవచ్చు. అక్కడి నుంచి కిలోమీటరు దూరంలో ఈ క్షేత్రం ఉంది. సింగుపురం, బూరవెల్లి మార్గంలో అయితే శాలిహుండం జంక్షన్ వద్దకు చేరుకుంటే అక్కడి నుంచి ఈ క్షేత్రానికి కాలినడకన లేదా వాహనాల్లో చేరుకోవచ్చు.

స్వయంభూ.. ఈ ఎండల మల్లన్న


ఎండల మల్లన్న శివలింగం

టెక్కలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శైవక్షేత్రమైన రావివలస ఎండమల్లికార్జున స్వామి భారతదేశంలోనే అతిపెద్ద సహజ శివలింగాల్లో ఒకటి. శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి 55 కిలోమీటర్ల దూరంలో గల రావివలసకు చేరుకునేందుకు బస్సులు, రైళ్లు, ఆటోల సౌకర్యం ఉంది. నౌపడ రైల్వే జంక్షన్, టెక్కలి రైల్వే స్టేషన్ల నుంచి ఆటోల ద్వారా రావివలసకు చేరుకోవచ్చు. టెక్కలికి ఐదు కిలోమీటర్ల దూరంలో గల రావివలస రాకపోకలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. స్థానిక ఇందిరాగాంధీ కూడలి, పాతబస్టాండ్ నుంచి కూడా రావివలసకు ఆటో సౌకర్యం ఉంది. సీతకోనేరులో స్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు దేవదాయ శాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్, ఈవో గురునాథరావు తెలిపారు.

ఏకశిలా పర్వతం... మహిమాన్వితం

జి.సిగడాం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెట్టవలస ఏకశిలా పర్వతంపై ఉన్న మల్లికార్జున స్వామి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. ఇక్కడి కొండపై శివలింగం దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజల పూజలందుకొంటోంది. రాజాం- శ్రీకాకుళం ప్రధాన రహదారికి కూతవేటు దూరంలో ఉన్న ఈ ఆలయానికి కార్తీక మాసంలో భక్తులు భారీగా తరలి వస్తారు. శివాలయానికి దగ్గరలో పాతాళబావి ఉంది. అన్ని కాలాల్లోనూ ఇక్కడ జలకళ ఉండడం విశేషం.

చర్మ వ్యాధులను తగ్గించే పాతాళేశ్వరుడు..

కంచిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కంచిలి మండలంలో సుమారు వందేళ్ల చరిత్ర ఉన్న ప్రాచీన పాతాళేశ్వరాలయంతో పాటు డోలగోవిందపురం శ్రీ బాలుంకేశ్వరాలయాలు ప్రసిద్ధి చెందినవి. జెన్నాఘయి గ్రామ సమీపంలోని కొండల్లో 1920లో గొల్లకంచిలి, చౌట్రాయిపురం గ్రామస్థులు పాతాళేశ్వరాలయాన్ని నిర్మించారు. భూమిలో కిందికి ఉన్న శివలింగాన్ని దర్శించుకునేందుకు మన రాష్ట్రంతో పాటు ఒడిశా, బెంగాల్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు వస్తుంటారు. అక్కడి శివలింగం నుంచి విభూదిని తీసి శరీరానికి పూసుకుంటే సోబి (చర్మ వ్యాధి) నయమవుతుందని భక్తుల విశ్వాసం. అక్కడికి వెళ్లేందుకు కంచిలి రైల్వే స్టేషన్, సోంపేట నుంచి ఆటోల సౌకర్యం ఉంది. డీజీపురంలోని బాలుంకేశ్వరాలయానికి ఒడిశా ప్రాంతం నుంచి వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు.


పాతాళేశ్వరుని సన్నిధిలో అర్చకుడు


మల్లికార్జునుని ఆలయం

ఒక్కడే దేవుడు... 3 రూపాల్లో పూజలు

సోంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోంపేట మండలం పలాసపురం గ్రామంలో వెలసిన ప్రాచీన కపిలేశ్వర విరించి నారాయణస్వామి దేవాలయంలో శివుడినే వేర్వేరు కాలాలలో (మాసాలలో) వేర్వేరు రూపాలుగా కొలవడం ఆచారం. సాధారణ రోజుల్లో కపిలేశ్వరుడిగా, ధనుర్మాసంలో బ్రహ్మగా, పుష్యమాసంలో విష్ణువుగా శివుడు పూజలందుకోవడం విశేషం. ఇక్కడి శివుడిని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచే కాక పక్క రాష్ట్రాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈ దేవాలయాన్ని దేవతలే నిర్మించారని చెబుతారు. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు ప్రతిరూపాలుగా ఈ దేవాలయంలో మూడు లింగాలు ఉన్నాయి. పుష్యమాసంలో మహిళలు చీపురులను కానుకగా అందజేస్తారు. దేవుడికి ప్రసాదంగా బూడిద గుమ్మడికాయలను ఇవ్వడం ఇక్కడి ప్రత్యేకత. శరీరంలో సోబి ఉంటే ఈ దేవాలయాన్ని సందర్శిస్తే ఇట్టే తగ్గిపోతుందనే నమ్మకం భక్తుల్లో ఉంది.


పలాసపురంలోని కపిలేశ్వర విరించి నారాయణ స్వామి దేవాలయం

శివ, విష్ణువుల ఆలయం..

నందిగాం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నందిగాం మండలం దిమిలాడలో శతాబ్దాల నాటి ధవళేశ్వర స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయంలో విష్ణుమూర్తి విగ్రహాన్ని, శివలింగాన్ని ప్రతిష్ఠించడం విశేషం. 11వ శతాబ్దంలో తూర్పు చాళుక్యులు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఏటా మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మూడు రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో ఉత్సవాలు నిర్వహిస్తుంటారు.


విష్ణుమూర్తి, శివలింగం

బలరాముడు నిర్మించిన ఉమారుద్ర కోటేశ్వరాలయం..


పుష్పాలంకరణలో ఉమారుద్ర కోటేశ్వర స్వామి

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణుని సోదరుడు బలరాముడు నిర్మించిన పంచలింగ శైవ క్షేత్రాలలో శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయం ఒకటిగా పెద్దలు చెబుతారు. ఇది నాగావళి నది ఒడ్డున ఉంది. వేల సంవత్సరాల చరిత్ర దీని సొంతం. దీనికి కొద్ది దూరంలోనే మణినాగేశ్వర ఆలయం ఉంది. శ్రీకాకుళంలోని ఏడు రోడ్ల కూడలికి సమీపంలో ఈ ఆలయం ఉంది. కార్తీకమాసం సందర్భంగా ఉమారుద్ర కోటేశ్వర ఆలయంలో భక్తుల దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం బయట బారికేడ్లను ఏర్పాటు చేశారు. వీటితో పాటు కొన్నావీధిలోని భీమేశ్వరాలయంలో, బలగలోని ఉత్తరేశ్వరాలయం, గుజరాతీపేటలో లక్ష్మేశ్వర శివాలయం, పాత శ్రీకాకుళంలో కాశీ విశ్వేశ్వరాలయం, జీవేశ్వరాలయం, శివకేశవ ఆలయం, మహాలక్ష్మీనగర్ కాలనీలో ఉన్న మండలేశ్వరాలయంలో కార్తీక మాస పూజలకు సన్నాహాలు చేస్తున్నారు.

సంతానం కలుగుతుందని...

వజ్రపుకొత్తూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బెండిలోని శ్రీ నందికేశ్వర ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. ఈ ఆలయాన్ని చోళరాజులు నిర్మించినట్లుగా చరిత్ర చెబుతోంది. ఈ ఆలయం శ్రీముఖలింగం ఆలయాన్ని పోలి ఉండడం విశేషం. శివరాత్రి, కార్తీక మాసంలో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ఆలయానికి చేరుకోవడానికి పలాస, కాశీబుగ్గ నుంచి బస్సులు, ఆటోల సదుపాయం ఉంది. శివసాగర్ తీరంలో ఉన్న శ్రీనీలకంఠేశ్వర ఆలయానికి 300 ఏళ్ల చరిత్ర ఉంది. సంతానం లేని దంపతులు ఈ ఆలయంలో పూజలు చేస్తే పిల్లలు పుడతారని భక్తుల విశ్వాసం. కార్తీకమాసంలో భక్తులకు కాశీబుగ్గ, పలాస నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి బస్సులు, ఆటోల సదుపాయం ఉంది.


శివసాగర్ తీరంలో ఉన్న నీలకంఠేశ్వర ఆలయం

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు సిద్ధం

● కేఆర్ స్టేడియంలో నేటి నుంచి ప్రారంభం
● జిల్లాకు చేరుకున్న క్రీడాకారులు


కేఆర్ స్టేడియంలో ఉన్న క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 2: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్, ఉషు పోటీలు నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 3, 4వ తేదీల్లో ఈ పోటీలు జరగనున్నాయి. ఇందు కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. అథ్లెటిక్స్ స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో, ఉషు పోటీలు ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో గల ఆడిటోరియంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే అన్ని జిల్లాల నుంచి బాలబాలికలు కోడి రామ్మూర్తి స్టేడియానికి చేరుకున్నారు. బాలికలకు స్టేడియం దరిలో గల బలగ మున్సిపల్ పాఠశాలలో వసతి ఏర్పాటు చేశారు. బాలురకు ఇల్లీసుపురం ఆర్‌సీఎం పాఠశాల, బలగ యూపీ స్కూల్, ఎన్టీఆర్ మున్సిపల్ పాఠశాలలో వసతి కల్పించారు. అనంతపురం నుంచి విజయనగరం వరకు జట్లు జిల్లాకు చేరుకున్నాయి. పోటీలకు సంబంధించి ట్రాక్ మార్కింగ్ పూర్తయింది. ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, డీఈవో తిరుమల చైతన్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి బీవీ రమణ, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు ఎంవీ రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి పర్యవేక్షణలో ఈ పోటీలు జరగనున్నాయి. ఆదివారం ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి.


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

● అలికాం రోడ్డు పనులు ప్రారంభించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు

శ్రీకాకుళం రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. రూరల్ మండలం అలికాం పంచాయతీ పరిధిలో రూ.12 లక్షలతో రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని ఆరోపించారు. గ్రామాల్లో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నమ్మండి... ఇవి అంగన్‌వాడీ కేంద్రాలే


మహాలక్ష్మీపురం కాలనీలోని పూరి గుడిసెలో అంగన్‌వాడీ కేంద్రం

హిరమండలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, గర్భిణులు, బాలింతల కోసం ఉద్దేశించిన అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత గూడు కరువవుతోంది. అనేకచోట్ల పూరి గుడిసెల్లో వీటిని నిర్వహిస్తుండటంతో చిన్నారుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. హిరమండలంలోని మహాలక్ష్మీపురం కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పూరి గుడిసెలోని గడపలో నిర్వహిస్తున్నారు. అది ప్రస్తుతం కూలిపోయే పరిస్థితిలో ఉంది. అక్కడ అంగన్‌వాడీ కేంద్రానికి నిధులు మంజూరైనప్పటికీ స్థల సమస్యతో భవన నిర్మాణం చేపట్టలేదు. గ్రామంలో ప్రభుత్వ స్థలం సేకరించడంలో అధికారులు విఫలమయ్యారు. సత్యజగన్నాథపురం గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని పూరి పాక అరుగు మీద నిర్వహిస్తున్నారు. సరైన వసతులు ఉండకపోవడం... ప్రాంగణాలు లేకపోవడంతో చిన్నారులు ఆటపాటలకు దూరమవుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరంతో పాటు ఆరోగ్యం, ఆనందాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నంగా పరిస్థితులు ఉండడం గమనార్హం.


సత్యజగన్నాథపురం గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని పూరి గుడిసెలో నిర్వహిస్తున్న దృశ్యం

ధాన్యం కొనుగోలు ఇంకెప్పుడు?

● జిల్లాలో ఇంకా ఏర్పాటు కాని కొనుగోలు కేంద్రాలు
● గోదావరి జిల్లాల నుంచి వ్యాపారులు వచ్చి తరలించుకుపోతున్న వైనం


పొలాల గట్ల వద్దనే ధాన్యం రాశులు


రొంపివలస వద్ద లోడింగ్‌కు సిద్ధం చేసిన ధాన్యం బస్తాలు

పాతపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రధానంగా తేలికపాటి రకాలకు సంబంధించిన పంట చేతికి అందడంతో రైతులు కోతలు ప్రారంభించారు. అయితే, జిల్లాలో ఎక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఇతర జిల్లాల నుంచి వ్యాపారులు వచ్చి పంటను తరలించుకు పోతున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 3,13,657 ఎకరాల్లో వరి పంట సాగు అవు తుంది. 1121, 1244 వంటి తేలికపాటి రకాలకు సంబంధించి పంట చేతికి అందడంతో రైతులు కోతలు చేస్తున్నారు. అయితే, ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో వారు దళారులను ఆశ్ర యించాల్సి వస్తోంది. ఉభయ గోదావరి, కృష్ణ, తదితర వంటి ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి పొలాల వద్దనే ధాన్యం కొనుగోలు చేసుకుని తరలించుకుపోతున్నారు. దళారులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. బస్తా 80 కేజీలు ఉండాలి. కానీ, 85 నుంచి 88 కేజీల వరకు తూస్తున్నారు. తడి ధాన్యమని చెబుతూ తరుగుపేరిట 5 నుంచి 8కేజీల వరకూ అధికంగా కొలుస్తున్నారు. బస్తాకు రూ.1,450 నుంచి రూ.1,500వరకు ధర చెల్లిస్తున్నారు. వాస్తవానికి వరి మద్దతు ధర క్వింటాకు రూ.2,310ఉంది. అంటే 80కేజీలకు సుమారు రూ.1,840 వరకూ రైతుకు అందాల్సి ఉంది. కానీ, ఇతర జిల్లాల నుంచి వస్తున్న వ్యాపారులు మాత్రం తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు 80కేజీల దగ్గర రూ.350 నుంచి రూ.400వరకూ నష్టపోతున్నారు. ఈ ఏడాది ఎకరాకు కనీసం 28 బస్తాల దిగుబడి ఉంది. ఈ నేపథ్యంలో వేలాది రూపాయల నష్టాన్ని వారు భరించాల్సి వస్తుంది.

తరలిపోతున్న నాణ్యమైన ధాన్యం..

నదీతీర ప్రాంతాల్లో పండే పంటలను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. నదీ జలాలు అందుబాటులో ఉన్న కారణంగా పంట నాణ్యతగా ఉంటుందని భావించి అక్కడి పంటలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రధానంగా ఒడిశా సరిహద్దు ప్రాంతాలైన పాతపట్నం, కొత్తూరు, హిరమండలం, మెళియా పుట్టి, ఎల్ఎన్‌పేట, ఇచ్ఛాపురం తదితర మండలాల్లో ధాన్యం కొనుగోలు వేగంగా జరిగిపోతున్నాయి. ప్రభుత్వం కొనుగోలు ప్రారంభించే సరికి ఈ ప్రాంత్రాల్లో నాణ్యమైన ధాన్యం ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడమే ఈ పరిస్థితికి కారణమనే విమర్శలు ఉన్నాయి.

త్వరలో ఏర్పాటు చేస్తాం..



మండలంలో ఈ ఏడాది 6,500 ఎకరాల్లో వరి పంట సాగవుతుంది. ఏగ్రేడ్-12, బిగ్రేడ్-2 వెరసి 14 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఉన్నతాధికా రులకు నివేదిక పంపాం. అతి త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం.

-రవికుమార్, మండల వ్యవసాయాధికారి, పాతపట్నం

ఆదిత్య ఆలయ మాస్టర్ ప్లాన్ పరిశీలన


ప్రద్యుమ్నకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ ఈవో భద్రాజీ

అరసవల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని విజయవాడ సెక్రటేరియట్‌లో గల ముఖ్యమంత్రి కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆదిత్య ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఆయన ఆలయ మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, సూపరింటెండెంట్ కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ పాల్గొన్నారు.

అవినీతిరహిత సమాజంతోనే దేశాభివృద్ధి

● శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అధికారి ప్రసాదరావు


శ్రీకాకుళం క్రైం: విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజంతోనే దేశాభివృద్ధి సాధ్యమని శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి బర్ల ప్రసాదరావు పిలుపునిచ్చారు. శనివారం శ్రీకాకుళంలోని సూర్యమహల్ కూడలి నుంచి ఏడురోడ్ల జంక్షన్ వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా విజిలెన్స్ ఎస్పీ విద్యార్థులతో సమగ్రతా ప్రతిజ్ఞ చేయించారు.

నిజాయితీని అలవాటు చేసుకోవాలి

అరసవల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజం కోసం అందరూ కృషిచేయాలని యూనియన్ బ్యాంకు చీఫ్‌మేనేజర్ బ్రిజేష్ సింగ్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని గొంటి వీధిలో గల ఓ ప్రైవేటు పాఠశాలలో విజిలెన్స్ వారోత్సవాలు పురస్కరించుకుని బ్యాంకు అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే నిజాయితీ అలవాటు చేసుకోవాలి కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఉదయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' ఎందుకు అమలు చేయలేదు: ఎమ్మెల్సీ

ఇచ్ఛాపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన టీడీపీ నాయకులు ఇంకా ప్రజలకు మాయ మాటలు చెప్పి మోసం చేస్తున్నారని ఎమ్మెల్సీ నర్తు రామారావు విమర్శించారు. శనివారం ఇచ్ఛాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామన్న చంద్రబాబు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఇంత వరకు గ్యాస్ సిలిండర్లు తప్పా మరేఒక్కటీ అమలు చేయలేని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, నాయకులు కారంగి మోహన్‌రావు, సుగ్గు ప్రేంకుమార్, మామయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ముగ్గురి ఎంపిక

ఇచ్ఛాపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈదుపురం (కేదబ్బ్యా) ఒడియా జడ్పీ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం బి.రామారావు తెలిపారు. అండర్-17 విభాగానికి పరమ బెహరా,తంబనాధు బెహరా, అండర్-14 విభాగానికి సోమేష్ బెహరా ఎంపికకయ్యారని చెప్పారు.ఈమేరకు వారిని శనివారం హెచ్‌ఎం తోపాటు ఉపాధ్యాయులు సరేష్‌పాడి, సబితాకుమారి, ఉషారాణి, ప్రశాంత్‌లిమ్మె, ఆనందరావు, మురళీధర్, పీఈటీ మోహన్‌రావు అభినందించారు. వీరు ఈనెల ఐదో తేదీ నుంచి నరసారావుపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ప్రతి హామీ అమలు చేస్తాం: ఎన్‌ఈఆర్


సిలిండరు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్

రణస్థలం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని అమలు చేయడమే ఎన్‌డీఏ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో సమావేశం మందిరంలో ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లంక శ్యామలరావు, ముప్పిడి సరేష్, డీజీఎం ఆనందరావు, లంక శ్యామలరావు, తహసీల్దార్ ఎస్‌ప్రసాద్, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

● సీఎంకు రూ.ఐదు లక్షలు అందజేసిన ఎస్‌ఎస్‌ఆర్ ట్రస్టు చైర్మన్


ముఖ్యమంత్రికి చెక్కును అందజేస్తున్న సూర శ్రీనివాసరావు

శ్రీకాకుళం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : విజయవాడ వరద బాధితుల కోసం రూ. ఐదు లక్షలు ఎస్‌ఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సూర శ్రీనివాసరావు విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు శనివారం శ్రీకాకుళంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం ఆయన్ను అభినందించారు. కూటమి పాలన నచ్చి పేదలకు సహాయం చేయాలన్న లక్ష్యంతోనే వరద బాధితుల కోసం ఈ చెక్కును ఇచ్చినట్లు శ్రీనివాసరావు చెప్పారు. అలాగే పవర్ ఆఫ్ శ్రీకాకుళం గ్రూప్ సభ్యులు తాము సేకరించిన రూ. 1.26 లక్షలను ముఖ్యమంత్రిని కలిసి వరదబాధితుల సహాయార్థం అందజేశారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి

రణస్థలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వైద్యుల సంక్షేమం కోసం కేరళా, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రస్తుతం అమలవుతున్న చట్టాలు రాష్ట్రంలో అమలు చేసి వైద్యులకు రక్షణ కల్పించాలని స్టేట్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ జయచంద్రనాయుడు, జిల్లా ఐఎంఏ ప్రెసిడెంట్ సనపల నరసింహమూర్తి కోరారు. ఈమేరకు శుక్రవారం రాత్రి వారు ముఖ్యమంత్రిని కలిసి వైద్యుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యుల రక్షణ కోసం రాష్ట్రంలో అమల్లో ఉన్న వైద్యుల పరిరక్షణ చట్టం నెంబరు 11లో మార్పులు తీసుకొచ్చి, చట్టాన్ని కఠినతరం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ గొండు గంగాధర్, డాక్టర్ శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న మాజీ ఎంపీపీ

ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చొరవతో మాజీ ఎంపీపీ డీజీఎం ఆనందరావు, నెల్లిమర్ల నియోజకవర్గం టీడీపీ సీనియర్ నేత వెంపడాపు సూర్యనారాయణ పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో శనివారం తీసుకున్నారు. చెరొ లక్ష రూపాయల చెక్కును అందజేశారు.

సీఎం దృష్టికి కార్మికుల సమస్యలు

పైడిభీమవరం పారిశ్రామికవాడలో పలు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు పడుతున్న ఇబ్బందులను జనసేన నేత వడ్డాది శ్రీనివాసరావు సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఇక్కడ పరిశ్రమల్లో పనిచేసిన ఉద్యోగులను బది లీల పేరుతో కాకినాడ,హైదరాబాద్ పంపిస్తున్నారని సీఎంకు వివరించారు. కార్మికులకు కోసం అత్యాధునిక పరికరాలతో ఆసుపత్రి నిర్మించాలని కొరారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇచ్ఛాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇచ్ఛాపురం నియోజకవర్గ సమస్యలను జనసేన పార్టీ పీఏసీ అధ్యక్షుడు మంత్రి నాదేండ్ల మనోహర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు తెలిపారు. సీఎంతో కలిసి పర్యటనకు వచ్చిన మనోహర్‌ను కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. సమస్యలను పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీఇచ్చారని తెలిపారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ.. పాదచారులకు పాట్లు

● శాశ్వత నిర్మాణాలు చేపట్టి వ్యాపారాల నిర్వహణ
● చోద్యం చూస్తున్న నగరపాలక సంస్థ అధికారులు
● ఇదీ శ్రీకాకుళంలో పరిస్థితి

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలో గల ఫుట్‌పాత్‌లు ఆక్రమణల వల్ల పాదచారులు, వాహనచోదకులు అవస్థలకు గురవుతున్నారు. ట్రాఫిక్ సమస్య నివారణ, పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను కొందరు వ్యాపారాలకు వినియోగించుకుంటున్నారు. నగరంలోని పాతబస్టాండ్ నుంచి ఏడురోడ్ల కూడలి, జీటీరోడ్డు, పాలకొండ రోడ్, ఆర్ట్స్ కళాశాల రోడ్డు, ఇలిసిపురం, రైతుబజారు, చిన్న బజారు వరకు నగరపాలక సంస్థ అధికారులు పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశారు. వ్యాపారులు తమ దుకాణాల ఎదుట ఫుట్‌పాత్‌లను తొలగించి తమకు అనుకూలంగా శాశ్వత నిర్మాణాలు చేపట్టడం విశేషం. దీంతో పాదచారులు రోడ్డుపైనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. మురుగు తొలగింపునకు పారిశుధ్య కార్మికులు అవస్థలు పడుతున్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపుపై నగరపాలక సంస్థ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి.


పాలకొండ రోడ్‌లో ఫుట్‌పాత్‌పై వ్యాపార సామగ్రి ఏర్పాటు చేసి విక్రయిస్తున్న దృశ్యం


జీటీ రోడ్డులో ఫుట్‌పాత్‌పై దుస్తుల వ్యాపారం చేస్తున్న వ్యాపారులు


చిన్నబజార్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై ..


అరసవల్లి: ఎర్రన్నాయుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు,అచ్చెన్నాయుడు


నరసన్నపేట: కొత్త బస్టాండ్‌లో ఎర్రన్నాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


పాతపట్నం: ఎర్రన్నాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

ఎర్రన్నాయుడు ఆదర్శప్రాయుడు

● జిల్లా వ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాలు

నేటి తరానికి దివంగత కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు ఆదర్శప్రాయుడని పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు తెలిపారు. శనివారం జిల్లా వ్యాప్తంగా ఎర్రన్నాయుడు వర్ధంతిని టీడీపీ నాయకులు నిర్వహించారు. శ్రీకాకుళంలోని ఏడురోడ్ల కూడలిలో గల ఎర్రన్న విగ్రహానికి కేంద్ర,రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు,అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్‌తో కలిసి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే జిల్లావ్యాప్తంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించి, ఆయన చేసి సేవలను గుర్తుచేసుకున్నారు.

– ఆంధ్రజ్యోతి బృందం


రణస్థలం: ఎర్రనాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్

క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి

● మంత్రి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


హెల్త్ సెంటర్ నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు

గార, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంపోలు సమీపంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేయనున్నట్లు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శనివారం గార, శ్రీకూర్మం పీహెచ్‌సీల వద్ద హెల్త్ సెంటర్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. తాన్‌సాహెబ్‌పేట వద్ద బస్ షెల్టర్ ప్రారంభించారు. దీపావళిలో దివంగత నేత ఎర్రన్న విగ్రహాన్ని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అంపోలు సమీపంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ఏడెకరాలు గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలో క్రికెట్ స్టేడియం నిర్మించాలన్న వాంఛ కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు ఉందని,ఈనేపద్యంలో ఇటీవల రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్నిని కలిసినట్లు చెప్పారు. జిల్లాలో టెంపుల్ టూరిజం అబివృద్ధికికూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇందులో భాగంగానే శ్రీకూర్మం, శ్రీముఖలింగం, అరసవల్లి క్షేత్రాలను కలుపుతూ టూరిజం అభివృద్ధికి కృషిచేస్తామని, సీఎం చంద్రబాబునాయుడు కూడా ఆసక్తిగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.మీనాక్షి, కూటమి నాయకులు పీసా వెంకట రమణమూర్తి, బడగల వెంకట అప్పారావు, గుండ భాస్కరరావు, జీవీ రమణమూర్తి పాల్గొన్నారు.

నేడు ఏపీ పీఆర్ డిప్లమో ఇంజనీర్ల సంఘం ఎన్నిక

శ్రీకాకుళం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు కేసీహెచ్ మహంతి, కార్యదర్శి ఎస్‌వీఏ పోలినాయుడు ఒకప్రకటనలో తెలిపారు.ఎన్నికలో డీఈఈలు, ఏఈలు, టీవోలు, ఏటీఓలు, జేటీఏలు, టెక్నికల్ అసిస్టెంట్లు, సైట్ ఇంజనీర్లు పాల్గొవాలని కోరారు.

నేడు కారా శతజయంతి సదస్సు

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాపూజీ కళామందిర్‌లో కాళీపట్నంరామారావు (కారా) శతజయంతి పురస్కరించుకుని సాహితీ స్రవంతి, శ్రీకాకుళ సాహితీ సంయుక్తంగా ఆదివారం శతజయంతి సదస్సు నిర్వహించనున్నాయి. ఎమ్మెల్యే గొండు శంకర్, అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజిని తదితరులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

నైపుణ్య గణనపై శిక్షణ

ఇచ్ఛాపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో వార్డు సెక్రటరీలకు నైపుణ్య గణనపై మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మహేష్ సిబ్బంది పాల్గొన్నారు.

కలర్ ప్రింటర్ వితరణ

కంచిలి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌సీపురం పాఠశాలకు కంచిలికి చెందిన గుడియా మురళి, పూనాశ్రీకాంత్ కలర్ ప్రింటర్‌ను అందజేశారు. హెచ్‌ఎం పి. ముకుందరరావు వారిని అబినందించారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

కంచిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘ సభ్యులు ప్రభుత్వం అందిస్తున్న వివిధ రుణాలను పెట్టుబడిగా ఉపయోగించుకుని ఆర్థికాభివృద్ధి సాధించేలా కృషి చేయాలని ఏపీఎం ప్రసాదరావు కోరారు.శనివారం జాడుపుడిలో మహిళా సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు.

విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదు

● ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కూన రవికుమార్ హెచ్చరించారు.శనివారం ఆమదాలవలసలో సచివాలయ, మునిసిపల్ సిబ్బందితో సమీక్షించారు. కార్య క్రమంలో మునిసిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్, టీడీపీ నాయకులు తమ్మినేని విద్యాసాగర్, బోర గోవిందరావు పాల్గొన్నారు.

● బూర్జ, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతుల భూముల రికార్డుల్లో తప్పులు సరిచేయాల్సిన బాధ్యత సర్వే చేసిన ఉద్యోగులపై ఉందని ఎమ్మెల్యే కూన రవికుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కంట్లాం పంచాయతీ లచ్చయ్యపేటలో భూముల రీసర్వే గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీతో తిరుపతిరావు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ అనెపు రామకృష్ణ, సర్పంచ్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

● సీఎం చంద్రబాబుకు విన్నవించిన 24 గంటల్లోనే పంపిణీ

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కేన్సర్‌తో బాధపడుతున్న తన తల్లికి మెరుగైన వైద్యంకోసం ఆర్థిక సహాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేసిన 24 గంటల్లోనే బాధిత కుటుంబానికి రూ.1.50లక్షల చెక్కును కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అందజేశారు. జలుమూరు మండలంలోని కరకవలసకు చెందిన పేరాడ సాయిరాం తన తల్లి అమ్మన్న కేన్సర్‌తో బాధపడుతుండడంతో వైద్యం కోసం ఆర్థిక సహాయం చేయాలని ముఖ్యమంత్రి ఎదుట శుక్రవారం ఈదుపురంలో జరిగిన కార్యక్రమంలో వాపోయాడు. దీంతో ముఖ్యమంత్రి వెంటనే స్పందించి వైద్యానికి అవసరమైన రూ.1.50లక్షల ఆర్థిక సహాయాన్ని అక్కడికక్కడే మంజూరు చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ తన చాంబర్‌లో చెక్కును సాయిరాంకు అందజేశారు. 24 గంటల్లోనే తమకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

చెప్పకుండా పనులెలా చేస్తున్నారు

● మండల సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌ల ధ్వజం

లావేరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మాకు చెప్పకుండా గ్రామాల్లో అభివృద్ధి పనులు ఎలా చేస్తున్నారని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ధ్వజమెత్తారు. శనివారం లావేరులో ఎంపీపీ లుట్టు అమ్మాజమ్మ అధ్యక్షతన మండలసమావేశం జరిగింది. గ్రామాల్లో సీసీరోడ్లు, కాలువల పనులు తమకు సమాచారం ఇవ్వకుండా, తీర్మానాలు లేకుండా పనులు ఎలా చేపడుతున్నారని గుర్రాలపాలేం ఎంపీటీసీ జనపాల భానోజీరావు, సర్పంచ్ షేక్ షాంధీభాష, చిన్నయ్యపపేట సర్పంచ్ కలిశెట్టి భాస్కరరావుతో పాటు పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. గుర్రాలపాలేంలో ఎస్‌ఎంసీ ఎన్నికలు తిరిగి నిర్వహించాలని సర్పంచ్, ఎంపీటీసీ షాంధీబాష, భానోజీరావులు ఎంఈవోను కోరారు. ఎంపీడీవో పి.వెంకటరాజు మాట్లాడుతూ గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.వెంకటాపురంలోని ఎరువుల షాపుల యజమానులు రైతులకు అవసరమైన మందులు అమ్మకానికి నిరాకరిస్తున్నారని గోవిందపురం సర్పంచ్ పిల్ల రాము నిలదీశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మీసాల సీతంన్నాయుడు, ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, తహసీల్దార్ వై.జోగారావు, ఏవో మహేష్‌నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మణికంఠ, ఇరిగేష్ ఏఈ గోవిందరావు పాల్గొన్నారు.

8 నుంచి జీవనోపాధుల సమాచార సేకరణ

అరసవల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నాలుగు పురపాలక సంఘాల్లో ఈనెల ఎనిమిది నుంచి30వతేదీ వరకు క్షేత్రస్థాయిలో ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ ద్వారా ఆర్పీలతో సంఘ సభ్యుల ఆర్థిక, జీవనోపాధుల సమాచార సేకరణను చేపడతామని మెప్మా పీడీ ఎస్వీ రమణ తెలిపారు. సమాచార సేకరణలో అనుసరించాల్సిన విధానంపై సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలని మెప్మా పీడీ ఎస్వీ రమణ సూచించారు. శనివారం శ్రీకాకుళంలోని రైతుబజారు సమీపంలో గల పట్టణ మహిళా సమాఖ్య వనరుల కేంద్రంలో జిల్లాస్థాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో టీఈ బి.రామారావు, సీఎంఎం ఎస్.వెంకటరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

కంచిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని తహసీల్దార్ రమేష్ కుమార్ శనివారం పరిశీలించారు. ఆయన వెంట జడ్పీటీసీ ఇప్పిలి లోలాక్షి, ఇప్పిలి కృష్ణారావు ఉన్నారు. అలాగే జాడుపుడి కేజీబీవీ పాఠశాలను శనివారం ఎంపీడీవో తిరుమలరావు, ఎంఈవో శివరాం ప్రసాద్ తనిఖీ చేశారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి

ఎచ్చెర్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల కొండపై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. కార్తీకమాసం ప్రారంభంకావడంతో అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఆరుగురు విద్యార్థినులకు గాయాలు

● స్కూల్ వ్యాన్‌ను వెనుకనుంచి ఢీకొన్న కారు



విద్యార్థినుల నుంచి వివరాలు సేకరిస్తున్న దృశ్యం

నరసన్నపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక జమ్ము జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు విద్యార్థినులకు గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పోలాకి మండలం జిల్లేడి మాకివలస నుంచి వస్తున్న స్కూల్ వ్యాన్‌ను జమ్ము జంక్షన్ వద్ద ఒక హోటల్ సమీపంలో కారు షడన్‌గా ఆపడంతో ఆ వెనుక ఉన్న వ్యాన్‌ను కూడా నిలుపుదల చేశారు. ఈ నేపథ్యంలో వెనుక వస్తున్న మరో కారు వ్యాన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూల్ వ్యాన్‌లో ఉన్న ఆరుగురు విద్యార్థినులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగ్రాతులను నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

శతాధిక వృద్ధుడు మృతి



కుమారస్వామి (ఫైల్)

పోలాకి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దీర్ఘాశి గ్రామకరణం, గ్రామపెద్ద 101 సంవత్సరాల వృద్ధుడు, ఆధ్యాత్మికవేత్త పులుగుర్త కుమారస్వామి వయో భారంతో శుక్రవారం సాయంత్రం మృతిచెందారు. ఈయన కరణీకం చేసేవారు. ఈయన తండ్రి ముద్దు కృష్ణమూర్తి, తల్లి మహలక్ష్మిలకు 1923లో జన్మించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రెవెన్యూ సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి ఓటు వేయిస్తామని చెప్పి నా అంగీకరించకుండా పోలింగ్ బూత్‌కు భార్య కుమారుడు, కోడలితో కలిసి వెళ్లి ఓటు వేశారు. ఈయనకు భార్య గిరిజమ్మ, కుమారుడు నాగేశ్వరరావు ఉన్నారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. కుమార స్వామి మృతి పట్ల దీర్ఘాశి రామలింగేశ్వర సత్సంగం అధ్యక్షుడు పంగ అప్పారావు, సలహాదారు పల్లి సూరిబాబు, పాగోటి చిరంజీవి, గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు.

రైలు నిలయంలో గుర్తు తెలియని మృతదేహం

కోటబొమ్మాళి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హరిశ్చంద్రపురం రైలు నిలయంలో శనివారం తెల్లవారుజామున రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ప్లాట్‌ఫారం తూర్పు చివర మృతదేహం ముఖం, వయసు గుర్తుపట్టలేని స్థితిలో తునాతునకలై ఉంది. మృతుడి అచూకీకి ఎటువంటి ఆధారాలు లభించలేదని రైల్వే పోలీసులు తెలిపారు. గ్యాంగ్‌మెన్ ఇచ్చిన సమాచారం మేరకు పలాస జీఆర్పీ పోలీసులు శనివారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి- ముగ్గురిపై కేసు నమోదు

కోటబొమ్మాళి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తనపై సుబ్బారావుపేటకి చెందిన కిరణ్, చందు, ఎత్తురాళ్లపాడుకు చెందిన సతీష్ దాడి చేశారని పాకివలస గ్రామానికి చెందిన దండాసి శ్రీరాములు శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వి.సత్య నారాయణ తెలిపారు. తాను క్లీనర్‌గా పనిచేస్తున్నానని, శుక్రవారం లారీపై వెళుతుండగా రాత్రి సుబ్బారావుపేట సమీపంలో వారు లారీని ఆపి పాత కక్షలతో దాడి చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లిక్కర్ తరలిస్తున్న వ్యక్తిపై..

పాతపట్నం నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చిన్నకోణంగి గ్రామసమీపంలో శనివారం లిక్కర్ తరలి స్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. శనివారం నిర్వహిం చిన దాడుల్లో భీముని పేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బెల్లండుటతో పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి 20 లీటర్ల ఐడి లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా ఈనెల 14 వరకు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో యువకుడి అరెస్టు

మెళియాపుట్టి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన యువకుడిని అరెస్టు చేసినట్లు పాతపట్నం సీఐ రామారావు తెలిపారు. శనివారం బాలిక పాఠశాల నుంచి సైకిల్‌పై వస్తుండగా యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడాడని బాలిక తల్లి ఫిర్యాదు చేసిందన్నారు. దీనిపై విచారణ చేసి యువకుడిని అరెస్ట్ చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఆమదాలవలస, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దివంజిపేట జంక్షన్ సమీపంలో అలికాం-బత్తిలి ఆర్అండ్‌బీ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు..సరుబుజ్జిలి మండలంలోని షలంత్రి గ్రామానికి చెందిన జె.ఎర్రన్నాయుడు ఆమదాలవలస నుంచి తన ద్విచక్ర వాహనంపై టీవీ కొనుగోలు చేసుకొని తీసుకొని వెళ్తున్నాడు. దివాంజిపేట జంక్షన్ వద్ద ఎదురుగా సరుబుజ్జిలి నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. క్షతగాత్రుడిని 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. బస్సు ను ఆమదాలవలస పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేయాల్సి ఉందని ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

వాచ్‌మన్ గుర్తించి.. వెంబడించడంతో..

● చోరీకి పాల్పడిన వ్యక్తి పరారీ



సీసీ కెమెరాలో చిక్కిన దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తి

శ్రీకాకుళం క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రునివలస సమీపంలో హైటెక్ ప్యారడైజ్ అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తి దుస్తులు మార్చుకుని సామగ్రిని సర్ది సుమారు ఒంటి గంట సమయంలో బయటకు వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో అపార్ట్ మెంట్ సీసీ కెమె రాల్లో దృశ్యాలను పరిశీలిస్తున్న వాచ్‌మెన్ ఈ విషయాన్ని గుర్తించాడు. దీంతో వెంబడించడంతో సదరు వ్యక్తి బ్యాగులు వదిలేసి పరారయ్యాడు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. హైటెక్ ప్యారడైజ్ అపార్ట్‌మెంట్‌లోని ఐదో అంతస్థులోని కుక్కల రామారావుకు చెందిన 523 నెంబరు ఇంటిలో బాల్కనీ డోర్ తెరిచి ఉండడంతో రక్షణ గోడ ఎక్కి ఆ ఇంట్లో చొరబడి ఓ వ్యక్తి దొంగతనానికి పాల్పడ్డాడు. వాచ్‌మెన్ ఈ విషయాన్ని గుర్తించి వెంబడించడంతో ఆ వ్యక్తి పరారయ్యాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడం, అపార్ట్‌మెంట్ గోడ తక్కువ ఎత్తులో ఉండడంతో దొంగ చొరబడినట్లు గుర్తించారు. రామారావు భార్య పోలీసులకు సమా చారమివ్వగా ఎస్ఐ కె.రాము అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. ఇంట్లో సుమారు నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలను దొంగిలిం చినట్లు పోలీసు లు గుర్తించారు. ఎస్ఐ రాము కేసు నమోదు చేసి సీసీ పుటేజీలను పరిశీలించగా, దొంగతనం చేసిన వ్యక్తి వివరాలు లభించాయి. కాగా బిల్డర్ల నిర్లక్ష్యం కారణంగానే దొంగతనాలు జరుగుతున్నాయని అపార్టుమెంటువాసులు పోలీసులకు తెలిపారు.

మంత్రి నాదెండ్లను కలిసిన కిరణ్



టెక్కలి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్‌ను జనసేన టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్ కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. భోగాపురం సమీపంలోని రిసార్ట్స్‌లో కలిసి పార్టీ నిర్మాణానికి చేపడుతున్న కార్యక్రమాలను ఆయనకు వివరించారు. సభ్యత్వ నమోదులో చురుకుగా పని చేసిన కిరణ్‌కుమార్‌ను మనోహర్ అభినందించారు.

గ్రామీణ ప్రాంతాల రోడ్లకు మహర్దశ



పలాస రూరల్: రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాసరూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లకు మహర్దశ పట్టిందని, రోడ్లకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. రెంటికోట నుంచి గొప్పిలి వెళ్లే మార్గంలో గోతులు పూడ్చే కార్యక్రమా నికి శనివారం ఆమె పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణ కుమార్, నేతలు పీరికట్ల విఠల్, హోరియా మోహనరావు పాల్గొన్నారు.

గోతులు లేని రోడ్లను చూస్తారు: ఎంజీఆర్

మెళియాపుట్టి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గోతులు లేని రోడ్డు చూస్తారని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. శనివారం వసుంధర నుంచి పట్టుపురం వరకు ఉన్న మార్గంలో గోతులు పూడ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లూ రోడ్లను పట్టించుకోలేదని విమర్శించారు. టీడీపీ నాయకులు ఎస్.మోహనరావు, రాజశేఖరెడ్డి పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు శ్రీకారం: బగ్గు

నరసన్నపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికాంలోకి వచ్చిన తరువాత రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోందని, ఇందులో భాగంగా గోతులు లేని రోడ్లను తయారుచేయ నున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం కంబకాయి జంక్షన్ వద్ద జలుమూరు-కంబకాయి-నరసన్నపేట రోడ్డు మరమ్మతు పనులకు భూమి పూజ నిర్వహించారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

'సూపర్‌సిక్స్' అందించడమే ధ్యేయం: కూన

సరుబుజ్జిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉన్నా సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు అందించడమే ధ్యేయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. శనివారం ఏబీ రోడ్డు వయా పురుషోత్తపురం రోడ్డులో గోతుల పూడ్చివేత పనులను ప్రారంభించారు. కార్య క్రమంలో డీఈ గణపతి, కేవీ సత్యనారాయణ, టీడీపీ నాయకులు సిద్దార్ద్, గోవిందరావు, గుర్రయ్య, భానోజీరావు, జేఈ అంజనేయ నాయక్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.







మెళియాపుట్టి, నరసన్నపేట, సరుబుజ్జిలిలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు మామిడి గోవిందరావు, బగ్గు రమణమూర్తి, కూన రవికుమార్

నైపుణ్య గణన అత్యుత్తమ నిర్ణయం

హిరమండలం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నైపుణ్య గణన ఈ శతాబ్దపు అత్యుత్తమ నిర్ణయమని, దీంతో ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం, కంపెనీలు, విద్యా సంస్థలు వారి ప్రాధాన్యతలను గుర్తించి బడ్జెట్ కేటాయింపులు, పరిశ్రమల స్థాపన, కళాశాలల్లో శిక్షణ చేపట్టేందుకు ఈ నైపుణ్య గణన ప్రామాణికంగా ఉంటుందన్నారు. దీనిని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశీప్రసాద రావు, ఏపీఎస్ఎస్‌డీసీ నోడల్ అధికారి మీరా పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

కాశీబుగ్గ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పలాసలో ఇటీవల లైంగిక దాడికి గురైన బాలికల కుటుంబానికి రూ.10 లక్షల చెక్కును వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు శనివారం అందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల జరిగిన టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య జరిగిన ఘర్షణను ఖండిస్తున్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసీపీ టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, హనుమంతు వెంకటరావు, పాల్గొన్నారు.

పరిశ్రమలపై అవగాహన కలిగి ఉండాలి

పలాస, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశ్రమలు, పర్యాటకరంగంపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి అన్నారు. ఈ మేరకు శనివారం బీఎస్సీ విద్యార్థులకు ఇండస్ట్రియల్ టూర్ నిర్వహించారు. టెక్కలిలోని పాడి పరిశ్రమ, తేలినీలాపురంలో పక్షుల విడిది కేంద్రం, రావివలస ఎండలమల్లికార్జున స్వామి ఆలయాలను సందర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ఎల్.ఎన్.పేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు పి.చిన్నారావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షులుగా జె.ఉష, ఉపాధ్యక్షులుగా ఎం.బాలసుబ్రహ్మణ్యం, బి.సుమతి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.డిల్లీశ్వర రావు, కోశాధికారిగా ఎస్.అజీమ్, కార్యదర్శులుగా పి.కామేశ్వరరావు, కె.వాసుదేవరావు, ఎస్.రామ్మోహన్‌రావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా శ్రీరామచంద్రమూర్తి వ్యవ హరించారన్నారు.

విద్యార్థులకు బిగ్'హెల్ప్'

టెక్కలి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నౌపడా ఆర్ఎస్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బిగ్ హెల్ప్ సంస్థ శనివారం దుప్పట్లు, కాస్మటిక్స్‌ను అందించింది. వీటిని విద్యార్థులకు హెచ్‌ఎం ఎన్.కృష్ణారావు అందజేశారు. ఏటా ఈ సంస్థ విద్యార్థులకు వివిధ రకాల కిట్లను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ రామముని రమేష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్టీ మాకివలస భూములపై కలెక్టర్‌కు నివేదిక

జలుమూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మర్రివలస పంచాయతీ ఎస్టీ మాకివలస రెవెన్యూ భూములపై సర్వే నిర్వహించి కలెక్టర్‌కు నివేదిక అందించనున్నట్లు తహసీల్దార్ జె.రామారావు తెలిపారు. ఈ భూములపై గ్రామస్థులు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కమిషన్ ఆదేశాల మేరకు శనివారం సదరు భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేలో డీటీ మధుబాబు, ఆర్ఐ కిరణ్, సర్వేయర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలు చెల్లించాలి

జలుమూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి డిమాండ్ చేశారు. చల్లవానిపేట ఉన్నత పాఠశాలలో శనివారం మండల మహాసభ నిర్వహించారు. యూటీఎఫ్ నేతలు ఎన్.హర్షవర్ధన్, కె.వైకుంఠరావు, ఎస్.పురుషోత్తం పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో డిసెంబరు 7న జవాన్ మిత్ర 5కే ర్యాలీ

● పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రులు

టెక్కలి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆర్మ్‌డ్ ఫోర్స్ ఫ్లాగ్ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సైనికులు, సైనిక అధికారుల ఆధ్వర్యంలో డిసెంబరు 7న జవాన్ మిత్ర 5కే ర్యాలీ నిర్వహించనున్నట్లు విశ్రాంత సైనిక ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కటకం పూర్ణ చంద్రరావు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లను శనివారం నిమ్మాడలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఏఎస్పీ ప్రభాకర్ ఆవిష్కరించారు. శ్రీకాకుళం నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియం నుంచి కలెక్టర్ బంగ్లా వరకు 5కే రన్ చేపట్టనున్నామన్నారు. మాజీ సైనికులు, వీర నారీ మణులకు ఉపయోగపడేలా నిధులు సమీకరణ కార్యక్రమం చేపడతామన్నారు. పారామిలటరీ, బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, అసోం రైఫిల్స్‌కు క్యాంటీన్లు, ఇతర జిల్లాల్లాగే సీజీహెచ్ ఆసుపత్రి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బోయిన గోవిందరాజులు, మెండ దాసునాయుడు, విశ్రాంత ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ ఉద్యోగులు పి.ఈశ్వరరావు, మురళీధర్, సింహాచలం, లక్ష్మి, జగ్గమ్మ, కేవీ రమణమూర్తి, రామారావు తదితరులు పాల్గొన్నారు.



జవాన్‌మిత్ర 5కే రన్ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న మంత్రులు

భావనపాడు జెట్టీ పరిశీలన

సంతబొమ్మాళి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని భావనపాడు తీరప్రాంతాన్ని ఎన్‌సీసీఆర్ శాస్త్రవేత్త సుధీర్ శనివారం పరిశీలించారు. భావనపాడులో హార్బర్ నిర్మాణానికి రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో మూడు రోజుల కిందట కేంద్ర బృందం భావనపాడు వచ్చి సముద్రతీరమంతా పర్యటించి అధ్యయనం చేసిన సంగతి తెలిసిందే. అలాగే ఎన్‌సీసీఆర్ శాస్త్రవేత్త సుధీర్ ఈ ప్రాంతాన్ని సందర్శించారు. సముద్రముఖ ద్వారం వద్ద ఇసుక మేటలను పరిశీలించారు. మత్స్యకారులతో ఇక్కడ సముద్రమట్టం పరిస్థితులు, ఇసుక మేట ఎలా వేస్తుందో అడిగి తెలుసుకున్నారు. సాంకేతికలోపాలను గుర్తించి ఇసుకమేటలు వేయకుండా తగు పరిష్కారం చూపుతూ నివేదిక ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ డీడీ పీవీ శ్రీనివాసరావు, పలాస ఏడీ సత్యనారాయణ, మత్స్య శాఖ అభివృద్ధి అధికారి ధర్మరాజు పాత్రో, సొసైటీ అధ్యక్షుడు గొరకల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎన్‌సీసీఆర్ శాస్త్రవేత్త సుధీర్

'ఉపాధి' పనుల్లో అక్రమాలు జరిగితే చర్యలు



సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ సుధాకర్‌రావు

జలుమూరు, (సారవకోట) నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగినట్లు రుజువైతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ సుధాకర్‌రావు అన్నా రు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీల్లో పనికి రాని వారికి మస్తర్లు వేయడం, కొలతల్లో తేడాలు ఉండడం తనిఖీ బృందం గుర్తించిందన్నారు. ఉపాధి పనుల్లో తప్పిదాలు జరిగినట్లు రుజువైతే సంబంధిత అధికారుల నుంచి రికవరీ చేస్తామన్నారు. సమావేశంలో ఏపీడీ లోకేష్, ఎంపీడీవో మోహనకుమార్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఏపీవో నారాయణరావు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో భూగర్భజలాల పెంపు

నరసన్నపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాలు పెంపుదలకు దోహదం చేస్తాయని డ్వామా పీడీ బి.సుధాకర్‌రావు అన్నారు. శనివారం తామరాపల్లిలో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ పనులను పరిశీలించారు. ఇళ్లలో ఇంకుడు గుంతల ఏర్పాటుకు ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీవో యుగంధర్, ఈసీ అప్పలనాయుడు పాల్గొన్నారు.

పనులను నాణ్యతతో చేపట్టాలి

పాతపట్నం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమా ణాలు పాటించాలని డ్వామా పీడీ బి.సుధాకర్‌రావు అన్నారు. ప్రహరాజపాలెంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం పరిశీలిం చారు. రోడ్డుకు ఇరువైపులా బెర్మ్‌లను చేయాలన్నారు. ఎంపీడీవో చంద్రకుమారి, ఉపాధి ఏపీవో అంగూరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీకి శాశ్వత నీటి సదుపాయం

పలాస, నవంబరు 2: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీకి శాశ్వత మంచినీటి సదుపాయం కల్పించేం దుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు టీడీపీ కార్యాల యంలో ఆర్‌డ బ్ల్యూఎస్, మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లక్ష మంది జనాభా ఉన్న జంట పట్టణాల్లో పూర్తిస్థాయి నీరు అందించలేకపోతున్నామని, ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు అనుసంధానంగా నీటి పథకం మంజూరైనా ఆ పనుల్లో జాప్యంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. పలాస, ఇచ్ఛాపురం నియోజక వర్గాలకు సరఫరా చేస్తున్న సమగ్ర నీటి పథకంతో పట్టణానికి అనుసంధానం చేసే దిశలో చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీటీడీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ టి.గాయత్రీదేవి, ఈఈ రంగాప్రసాద్, డీఈఈలు పి.సూర్య నారాయణ, డి.ఆశాలత, ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ చట్టపరమైన సేవలు అందాలి



పాతపట్నం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ చట్టపరమైన సేవలు అందించాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్. సన్యాసినాయుడు అన్నారు. సబ్‌జైలును శనివారం సందర్శించారు. పలు సూచనలు చేశారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

హరిపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సిరిపురం హైస్కూల్‌లో చదువుతూ పదో తరగతిలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు శనివారం నగదు పురస్కారాలను పూర్వ విద్యార్థి, ఎస్ఐఎస్ఎఫ్ సంస్థ సీఈవో సునీల్ కుమార్ మహంతి, హెచ్‌ఎం ఎన్.తారకేశ్వరరావు అందించారు. వివిధ స్థాయిల్లో ప్రతిభ కనబరిచిన వారికి రూ.47 లక్షలు, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు రూ.10 లక్షలు మొత్తాన్ని హెచ్‌ఎంకు అందజేశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్‌ను ఉపాధ్యాయులు సత్కరించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. ఎంతో ఉదారతతో ప్రతి ఏటా తెలుగు, ఒడియా మీడియం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.వైకుంఠ రావు, డిల్లీ, చలపతి, మోహనరావు, రమణరావు, కామేశ్వరరావు, లక్ష్మి, తనూజ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన

జలుమూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) లోక కల్యాణార్థం శ్రీముఖలింగేశ్వరాలయంలో ముఖలింగేశ్వర స్వామికి కార్తీక మాసం సందర్భంగా శనివారం గ్రామానికి చెందిన తండాసి ఢిల్లేశ్వరరావు లక్ష బిల్వార్చన నిర్వహించారు. ముందుగా అర్చకులు గణపతిపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, చండీ సప్తశతీ పారాయణ చేపట్టారు.

ఇంటర్వ్యూ

అపరాల విత్తనాల కోసం పేర్లు నమోదు

● ఏడీఏ ఎల్వీ మధు



పలాసరూరల్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): రబీసీజన్‌కు సంబంధించి అపరాల విత్తనాల కోసం పేర్లు నమోదుచేసుకోవాలని ఏడీఏ ఎల్వీ మధు అన్నారు.

ప్రశ్న: అపరాల విత్తనాలను ఎప్పుడు అందించనున్నారు?

జవాబు: అపరాల విత్తనాలు కావాల్సిన వారు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుంటే వారికి అవసరమైన రకాలు అందిస్తాం.

ప్ర: వరికి తెగుళ్లు, సుడిదోమతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు? ఎటువంటి సలహాలిస్తున్నారు?

జ: సుడిదోమ వంటి తెగుళ్లు వరికి ఉంటే డైనోట్ సిరాన్‌టషన్‌ను 100గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ప్ర: 2018-2019 ఫిబ్రవరి తరువాత పీఎం కిసాన్ లబ్ధి కోసం నమోదు చేస్తున్న వారికి అందడం లేదు. వారి నమోదుకై చర్యలు తీసుకుంటున్నారా?

జ: రైతు సేవా కేంద్రాల్లో వీవోఏ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్‌ను రైతులు చేసుకుంటే వాటిని త్వరలో 2024-25 ఏడాదిలో చేర్చి సమస్యలను తీర్చేందుకు ఉన్నతాధికారులకు తెలియజేయడం జరుగుతుంది.

న్యూస్ బాక్స్

దాడి బాధ్యులను శిక్షించాలి

కోటబొమ్మాళి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కిష్టుపురం గ్రామంలో దళితులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జోగి గన్నయ్య కోరారు. శనివారం కిష్టుపురంలో చల్ల అప్పలరాజు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం దళితులపై దాడుతు జరుగుతుంటే ప్రభుత్వాలు, చట్టాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేయకుంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కేవీపీఎస్ నాయకులు కాళ్ల నర్సింహులు, జోగి నర్సింహులు, కుప్పిలి మురళి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పరిరక్షణను బాధ్యతగా స్వీకరించాలి

వజ్రపుకొత్తూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొక్కలే మనిషికి జీవనాధారమని గ్రీన్ ఆర్మీ అధ్య క్షుడు బోనెల గోపాల్ అన్నారు. హుకుంపేట హైస్కూల్ ఆవరణలో శనివారం ఉసిరి, జామ, బాదం, కదంబం, చెర్రీ మొక్కలను నాటారు. మొక్కల పరిరక్షణను విద్యార్థులు బాధ్యతగా స్వీకరించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పరసరాలు పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

దాతల సాయంతో అభివృద్ధి

వజ్రపుకొత్తూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని శివసాగర్‌బీచ్ శ్రీనీలకంఠేశ్వర, విఘ్నేశ్వర, సుబ్రహ్మణ స్వామి ఆలయాల కమిటీ అధ్యక్షుడు మద్దు నాగేశ్వరరావు అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. కార్తీమాసం సందర్భంగా భక్తులు వచ్చి పూజలు చేసుకునేందుకుగాను ఆలయాలను, పరిసరాలను బాగు చేస్తున్నామన్నారు. అవసరమైన మరమ్మతులు చేపడుతున్నామని చెప్పారు.

కళాశాల తనిఖీ

కోటబొమ్మాళి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వంశధార జూనియర్ కళాశాలను శనివారం ఆర్ఐవో ప్రగడ దుర్గాప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అవగాహన శక్తిని, అధ్యాపకుల బోధనను పరిశీలించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూప్ విద్యార్థులకు లెక్కలకు సంబంధించిన ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకుడు చింతాడ అనిరుద్రుడు, ప్రిన్సిపాల్ డీవీ రమణమూర్తి పాల్గొన్నారు.

కాపుతెంబూరుకు బస్సు ప్రారంభం

నందిగాం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాపుతెంబూరుకు నూతన బస్సు సర్వీసును శనివారం ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు టెక్కలి ఆర్టీసీ డిపో నుంచి శనివారం కాపుతెంబూరుకు బస్సు సర్వీసును స్థానిక టీడీపీ యువనాయకుడు కొల్లి హరిబాబు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకుడు పోలాకి రామకృష్ణ, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలతో దిగుబడి నిర్ధారణ

ఎల్.ఎన్.పేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పంటకోత ప్రయోగాల ద్వారా వరి పంటల దిగుబడి నిర్ధారణ చేస్తున్నట్లు పంటకోత ప్రయోగాల తనిఖీ అధికారి ఎల్.కల్యాణ్ కుమార్ అన్నారు. పూశాం గ్రామంలో శనివారం ఏఎస్‌వో పి.అప్పలనాయుడు ఆధ్వర్యంలో ప్రయోగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది మండలంలో 112 పంటకోత ప్రయోగాలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ కార్యదర్శులు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.